# మనశ్శాంతి భక్షకుడు

మనవాడు చాలా అదృష్టవంతుడోయ్ - పదవి వచ్చినా, రాక పోయినా, ఒక అంగరక్షకుణ్ణి సంపాదించాడు అన్నాడు నా మిత్రుడు.

నిజమే! ఎంత దర్జా! హోదా! ప్రక్కన గన్ను పుచ్చుకుని అంగ రక్షకుడు నడుస్తోంటే, కాబోయే మంత్రిలా వున్నాడు! అన్నాను.

ఇంతలో ఎన్నికల్లో పోటీచేస్తున్న మా పొరుగింటి మనిషి రానే వచ్చాడు- సైకిలు మీద- సైకిలు వెనుక సీటు మీద అంగరక్షకుడు కూడా.

అదృష్టమంటే నీదేనోయి! అన్నా.

దేనికిసార్! అన్నాడు- ఎన్నికల్లో విజయ ఫలితం వచ్చి విన్నంతగా.

మీ అంగరక్షకుడ దర్జా! అన్నాను.

అవును అతనిది దర్జాయే! నాకే ఈతి బాధలా వుంది.

ఏం!

నేనా సన్నగా 60 పౌండ్ల మనిషిని- అతనా 120 పౌండ్ల భారీ మనిషి- అతన్ని వెంటబెట్టుకుని సైకిలు మీద కూర్చో పెట్టుకుని తిరగ లేక ఛస్తున్నానోయ్! అన్నాడు అభ్యర్థి.

గట్టిగా అనకయ్యా! అతనికి తెలుస్తే బాధపడతాడు.

అబ్బే అతనికి తెలుగు రాదయ్యా! వాడి భాష నాకు రాదు! సంజ్ఞలు చేసుకుంటూ బతుకుతున్నా! అన్నాడు.

బాగుంది నీ కథ! అన్నాను నేను జాలిగా.

సార్! యీ ఖర్చంతా ఎన్నికల ఖర్చులో కలపరుకదా! అన్నాడు నా మిత్రుడు.

ఏమో! ఏం జరుగుతుందో! అని నిట్టూర్పు విడిచాడు అభ్యర్థి.

మరి ప్రచారం బాగా జరుగుతోందా!

ఏం బాగా జరగడం? నేను నమస్కారం పెట్టి వోటిమ్మని అడుగుతుంటే, నా భయంకర అంగరక్షకుడిని చూసి జనం దూరంగా పారిపోతున్నారు సార్! అంటూ కన్నీళ్ళు వచ్చే పర్యంతం గద్గదంగా అన్నాడు అభ్యర్థి.

అయ్యో! పాపం!- ఆయన్నికూడా ప్రచారం చేయమనలేక పోయారా?

రూల్సు ఒప్పుకోవు! అతను ఒక్కొక్కసారి నా గూఢచారేమో అని భయంగా కూడా వుంది.

పగలల్లా ప్రచారంచేసి, సైకిలు తొక్కి ఇంటికి వెళ్ళాక- మీకు కలిగిన శ్రమవల్ల హాయిగా నిద్రపోతూ ఉన్నారనుకుంటా! అన్నాను ఆయనతో. శ్రమపడినవాడికి ప్రశాంతమైన నిద్ర వస్తుందిగా అని.

ఏం నిద్ర బాబూ- అసలే ఎన్నికల పోటీలో దిగి, నెగ్గుతానా అనే విచారంతో మనసు వికలమై నిద్రపట్టేదికాదు- పైగా అంబరక్షకుడు పెట్టే భయంకరమైన గుర్రువల్ల నాకే కాదు, ఇంటిల్లిపాది వారికీ నిద్ర రావడం లేదు.

-పైగా ఉన్న రెండు గదుల్లో ఓ గది వాడికి యిచ్చేసి, రెండో గది వంటిల్లులో మేమంతా ముడుచుకుని యిబ్బందిగా పండుకుంటున్నాం అన్నాడు అభ్యర్థి నీరసంగా.

మరో స్వతంత్ర అభ్యర్థి ఆ దారిన పోతున్నాడు. గున్న ఏనుగలా వున్నాడు. జనమే లేరు వెంట. ప్రచార పాదయాత్రలో- ఒక్క అంగరక్షకుడు తప్ప-ఆయన ఎన్నికల గుర్తు రెండాకులట ఆ రెండాకులు తన అంగరక్షకుడి గన్నుకు కట్టి' చిదానందంగా నవ్వుతూ- 'దీనికే మీ ఓటు

వేయండి' అంటూ పోతుంటే ప్రజలకు సందేహం వస్తోంది- రెండాకులకు వేయాలా? లేక గన్నుకు వేయాలా ఓటు- అని.

మరొకాయన అంగరక్షకుడి గన్నుపై కుండ బోర్లించి ఓట్ల ప్రచారం చేసుకుంటున్నాడు- ఆయన ఎన్నిక గుర్తుకుండట!

మరో అభ్యర్థి తన భార్యతో స్కూటరుమీద దిగాడు మాముందు.

ఎలా వుంది గురువుగారు ప్రచారం అన్నా!

బాగానే వుంది అన్నాడు ఆయాసంగా.

ప్రక్కనే కారు ఆగింది. అందులోంచి అంగరక్షకుడు దిగాడు.

ఇదేమిటి! మీరు స్కూటరు మీద అంగరక్షకుడు కారుమీదా? అన్నాను ఆశ్చర్యపడి.

ఇదీ సార్ మా బాధ! నాకు అంగరక్షకుడెందుకండీ! నా భార్యే నాకు అంగరక్షకుడిగా ఉంటేనూ! ఎంత ఖర్చు!! అదే కారు ఖర్చు! పైగా అదే కారులో నా భార్యా, నేను ఓసారి ఎక్కితే, అస్తమానూ భార్యకేసే చూస్తున్నాడు సార్ వాడు అన్నాడు అభ్యర్థి గోలగోలగా.

అతడికి మెల్లకన్నేమో!

పోనీ వాపసు పంపిచేయండి అంగరక్షకుడిని అన్నాడు నామిత్రుడు.

అలా పనికిరాదట! ఎన్నికలయ్యేదాకా మాకు తప్పదట యీ గుదిబండ అన్నాడు అభ్యర్థి.

అంగరక్షకుడు సాల్యూట్ చేశాడు నన్ను, నా మిత్రుడ్ని చూసి.

మా భాష రాదు కదా! ఓ చిరునవ్వు నవ్వాడంతే!

నా పిలక గుర్తుకే మీ ఓటు వెయ్యండి సార్ అన్నాడు అభ్యర్థి.

గాలిలో చెదిరిపోయిన అభ్యర్థి పిలకను సరిచేసింది ఆయన భార్య.

ఎన్నిక సంగతి ఎలా వున్నా. ప్రస్తుతం మాకు మనశ్శాంతి పోతోందండి! యీ అంగరక్షకుడివల్ల అంది అతని భార్య విచారంగా.

అందుకేనయ్యా! ఈయన అంగరక్షకుడు కాదయ్యా! మా మనశ్శాంతి భక్షకుడు అన్నాడు అభ్యర్థి బాధగా స్కూటర్ స్టార్ట్ చేస్తూ, పంచె సర్దుకుంటూ.